క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురం మున్సిపాలిటీ పార్టీ పరిశీలకుడు వేగిరాజు సాయిరాజు తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిని కలిసిన జిన్నూరి



నాగిరెడ్డికి మొక్కను అందజేస్తున్న జిన్నూరి రామారావు తదితరులు

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఎంవీఎస్ నాగిరెడ్డిని పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబి) మంగళవారం కలిశారు. కృష్ణా జిల్లా గుడివాడలో మంగళవారం నాగిరెడ్డి నివాసంలో బాబి మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నాగిరెడ్డి పనిచేసిన విషయం తెలిసిందే. బాబితో పాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు ఉన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించాలి

యానాం: కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కలిశారు. ఈ సందర్భంగా సముద్రం నుంచి ఐలాండ్ నంబరు-3 మీదుగా వెళ్లిన ఓఎన్‌జీసీ పైపులైను నుంచి గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగిన ఘటన అంశాన్ని తెలియజేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని, స్థానిక మత్స్యకారులకు, ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు పరిహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలకు అడ్డుకట్ట

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో గ్రూప్-సి, బి (నాన్‌గెజిటెడ్) పోస్టుల ప్రత్యక్ష నియామకానికి పుదుచ్చేరి ఎగ్జామినేషన్ అథారిటీని ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని ఎల్జీ కె.కై లాసనాథన్‌ను మాజీ ఎంపీ రామదాస్ అభినందించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరిలో రాజకీయ సిఫార్సులు, డబ్బులతో అర్హతలు లేని వ్యక్తులతో బ్యాక్‌డోర్ అక్రమ నియామకాలను ఈ ఎగ్జామినేషన్ అథారిటీ అడ్డుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాలు, స్వయంప్రతిపత్తి సంస్థల్లో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాల భర్తీ చేయడానికి పారదర్శకతతో పనిచేయడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుందని రామదాస్ అన్నారు.

ఐడియా పిచ్ పోటీల్లో బీవీసీ విద్యార్థి ప్రతిభ

అమలాపురం రూరల్: రాజమండ్రిలో నిర్వహించిన ఎంట్రప్రెన్యూర్ సమ్మిట్-2025 ఐడియా పిచ్ పోటీల్లో అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ డిప్లమో ఇంజినీరింగ్ సీఎంఈ విద్యార్థి పూజారి అనిల్‌బాబు విశేష ప్రతిభ కనబరిచి రూ.1.25 లక్షల నగదు బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా అనిల్‌బాబును బీవీసీ కళాశాలల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, డిప్లమో ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ ఫణి శంకర్, బీటెక్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అభినందించారు. అనిల్‌బాబు ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామని చైర్మన్ సతీష్ భరోసా ఇచ్చారు.

మహిళలకు సమానత్వ హక్కులు కల్పించాలి

కొత్తపేట: అమ్మాయికి జననం నుంచే విద్య, ఉద్యోగంలో ప్రాధాన్యం ఇస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు అన్ని రంగాల్లో సమానత్వ హక్కులు కల్పించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అన్నారు. మంగళవారం 'మహిళా సమానత్వ దినోత్సవం' పురస్కరించుకుని బాలికా విద్య, స్త్రీ హక్కులు తదితర అంశాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ నాగరాణి ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ద్రౌపదిముర్ము మన రాష్ట్రపతిగా, అంతర్జాతీయ స్థాయిలో పీవీ సింధు, మేరీకోమ్, మిథాలీరాజ్ వంటి క్రీడాకారిణులు దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. పూర్వం నుంచి మన దేశంలో చరిత్ర సృష్టించిన మహిళామూర్తులను ఆదర్శంగా తీసుకోవడం ద్వారా మహిళలు విద్య, ఉద్యోగాలు, క్రీడలు, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. ముందుగా మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.అంకమరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊరూవాడ చవితి శోభ

- కొనుగోలుదారులతో పూజా సామగ్రి దుకాణాలు కిటకిట
- అమలాపురం ప్రధాన వీధుల్లో రద్దీ



అమలాపురంలో ఆకట్టుకుంటున్న షరాబుల వినాయక చవితి పందిరి



మురమళ్ల మార్కెట్లో పత్రి, పూల విక్రయ దుకాణాలు



వానపల్లిపాలెంలో విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా ముస్తాబైన పందిరి

అమలాపురం టౌన్: వినాయక చవితి పూజా సామగ్రి దుకాణాలతో మంగళవారం అమలాపురం మార్కెట్ కిటకిటలాడింది. ఉదయం నుంచి వర్షపు జల్లులు పడుతున్నా వినాయక పూజలు చేసుకునే భక్తులు మాత్రం పూలు, పండ్లు, పత్రి తదితర సామగ్రి కొనుగోలు కోసం గొడుగులు, జర్కిన్లతో మార్కెట్ బాట పట్టారు. పట్టణంలో పలు రోడ్లలో దాదాపు 500కి పైగా పూజా సామగ్రి దుకాణాలు రోడ్ల చెంత వెలిశాయి. మంగళవారం ఒక్కరోజే చవితి మార్కెట్ ద్వారా దాదాపు రూ.50 లక్షలకు పైగానే వ్యాపార లావాదేవీలు జరిగినట్లు ఒక అంచనా. ఓ పక్క వర్షం జల్లులు పడుతున్నా భక్తులు పూజా సామగ్రి కొనుగోలుకు మార్కెట్‌లోకి రావడం కనిపించింది. గతేడాదితో పోల్చుకుంటే వినాయక చవితి పండుగ పాలవెల్లితో అలంకరించేందుకు పలు రకాల పండ్లు, పత్రి తదితర సామగ్రి ధరలు 30 శాతం పెరుగుదల కనిపించింది. గతేడాది అన్ని రకాల పండ్లు, పత్రి కొనుగోలుకు రూ.200 నుంచి రూ.300 అయితే ప్రస్తుతం రూ.300 నుంచి రూ.500 వరకూ వెచ్చించాల్సి వచ్చిందని పలువురు అన్నారు. పూల ధరలు భారీగా పెరగడంతో కొద్దిగానే పలువురు కొనుగోలు చేశారు. పండ్లు, పూలు దుకాణాల్లో ధరలు చూసి కొనుగోలుదారులు నోరెళ్లబెట్టినా చివరకూ తమ స్తోమత తగినట్లుగా కొనుగోలు చేశారు.

వినాయక లడ్డూలకు గిరాకీ

చవితి పూజల్లో వినాయకుని వద్ద పెట్టేందుకు పట్టణంలోని పలు స్వీటు దుకాణాలు భారీ సైజులో లడ్డూలను తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచాయి. భక్తులకు వారు కోరుకునే విధంగా అనువైన సైజుల్లో భారీ లడ్డూలను వ్యాపారులు తయారు చేస్తున్నారు. గణపతి ఆలయాలు, వినాయక చలువ పందిళ్లతోపాటు పలువురు తమ ఇళ్లలో చేసుకునే చవితి పూజల్లో స్వామి సన్నిధిలో ఈ భారీ లడ్డూలను ఉంచి పూజలు చేయడం ఆనవాయితీ. కేజీ నుంచి పది కిలోల వరకూ పెద్ద లడ్డూలను తయారు చేసి స్వీటు షాపుల్లో విక్రయం కోసం ప్రదర్శనగా ఉంచారు.

ఆకట్టుకుంటున్న చలువ పందిళ్లు

వాడవాడలా ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక గడియారం స్తంభం సెంటరులో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో బులియన్ అసోసియేషన్ నెలకొల్పిన షరాబుల పందిరి, మార్కెట్ వీధి పందిరి ఇలా పలు చోట్ల వినాయక పందిళ్లు ఆకట్టుకుంటున్నాయి. ముమ్మిడివరం గేటు సెంటరులోని షరాబుల పందరిని భారీ సెట్టింగులతో ఆకర్షణీయంగా సిద్ధం చేశారు.

పల్లెల్లో చవితి సందడి

ఐ.పోలవరం: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పల్లెల్లో ఘనంగా ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వేసి పచ్చని తోరణాలు కట్టారు. గణనాథులు కొలువుతీరేందుకు ఉత్సవ మండపాలు సర్వాంగ సుందరంగా సిద్ధమయ్యాయి. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. మురమళ్ల, పాతయింజరం మార్కెట్లో మంగళవారం చవితి సందడితో కళకళలాడాయి. ఐ.పోలవరం మండలంలో పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో యువజన సంఘాలు, వర్తక, వాణిజ్య, కులవృత్తి సంఘాలు, వివిధ రకాల యూనియన్ల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి వైభవంగా గణపతి నవరాత్రులు నిర్వహించనున్నారు.



అమలాపురం మార్కెట్లో చవితి పూజా సామగ్రి దుకాణాల వద్ద రద్దీ



అమలాపురంలో ఓ స్వీటు దుకాణంలోని లడ్డూలు

ముస్తాబైన నవరాత్రి మండపాలు

ఉప్పలగుప్తం: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో నవరాత్రి చలువ పందిళ్లు ముస్తాబయ్యాయి. గొల్లవిల్లి, కూనవరం, ఉప్పలగుప్తం, చల్లపల్లి, వానపల్లిపాలెం, విలసవిల్లి, సన్నవిల్లి గ్రామాల్లో విభిన్న రకాల వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు.

వినాయక మట్టి ప్రతిమలను పూజించాలి

అమలాపురం టౌన్: అంతా వినాయక మట్టి విగ్రహామయం అన్నట్లు వినాయక చవిత పండుగకు ఈసారి పర్యావరణ చైతన్యంతో పూజలు జరుపుకోనున్నారు. అమలాపురంలోని పలు సంస్థలు, విద్యాలయాల వద్ద మంగళవారం వినాయక మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన దంత వైద్యురాలు ప్రవల్లిక స్థానిక గడియారం స్తంభం సెంటరులో, పలు విద్యాలయాల్లో మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. చవితి ఉత్సవాలను విద్యాలయాల్లో వైభవంగా నిర్వహించారు. నల్లా చారిటబుల్ ఆధ్వర్యంలో చైర్మన్ నల్లా పవన్‌కుమార్ స్థానిక షరాబుల గణపతి చలువ పందిరిలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, గణేష్ వర్తకం సంఘం అధ్యక్షుడు వలవల శివరావు తదితరులు కూడా మట్టి విగ్రహాలు భక్తులకు అందజేశారు.

కలెక్టర్‌కు మట్టి ప్రతిమ అందజేత

వినాయక మట్టి విగ్రహాలతోనే చవితి పూజలు చేసుకుని పర్యావరణ పరిరక్షణలో జిల్లా ప్రజలు భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆకాంక్షించారు. కోనసీమ ఆహార నిధి సంస్థ ప్రతినిధుల బృందం కలెక్టర్‌కు మంగళవారం వినాయక మట్టి ప్రతిమను అందజేసింది. కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరులకు కోనసీమ ఆహార నిధి సంస్థ వ్యవస్థాపకుడు వీరంశెట్టి సతీష్ బృందం మట్టి విగ్రహాలను అందజేసింది.



అమలాపురంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దంత వైద్యురాలు ప్రవల్లిక

మట్టి ప్రతిమలు మేలు

అల్లవరం: పర్యావరణకు మేలు చేసే మట్టి ప్రతిమలను పూజించాలని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. సాయి బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బండిగుప్తాపు పాండురంగ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్పీ వినాయక మట్టి ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై సంపత్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి గోపి, బండిగుప్తాపు భార్గవ్ పాల్గొన్నారు.



అమలాపురంలో ప్రయాణికులకు మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న నల్లా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

పర్యావరణాన్ని కాపాడుదాం

అమలాపురం రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ హాలు వద్ద మంగళవారం వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గణపతి మాట్లాడుతూ మట్టి గణపతి పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ అనిల్‌కుమార్ జైన్, పూర్వపు జిల్లా గవర్నర్ పీఎస్ శర్మ,పూర్వపు అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పి.మల్లవరంలో విద్యార్థుల ప్రదర్శన

తాళ్లరేవు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయక మట్టి ప్రతిమలను పూజించండి, పర్యావరణాన్ని కాపాడండి అంటూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. పి.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మొండి వీరబాబు ఆధ్వర్యంలో మంగళవారం వినాయక మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేసారు.



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు మట్టి వినాయక ప్రతిమ అందజేస్తున్న కోనసీమ ఆహార నిధి సభ్యులు



వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



చింతా అనురాధ

అల్లవరం: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆది దంపతుల కుమారుడైన గణనాథుడిని భక్తి శ్రద్ధలతో పూజించి ఆయన కృపతో ప్రజలకు సమస్త విఘ్నాలు తొలగి, తలపెట్టే కార్యాలన్నీ విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఆ గణపతి అనుగ్రహంతో ప్రజలందరికీ సదా, సర్వదా అభయ, లాభ, శుభాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చింతా అనురాధ తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న దాతలు, డీవైఈవో సూర్య ప్రకాశం

అమలాపురం టౌన్: కోనసీమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి చదివి 80 శాతం పైగా మార్కులు సాధించిన వంద మంది విద్యార్థులకు విజయనగరం పీవీజీ రాజు ట్రస్ట్ ఒక్కొక్కరికీ రూ.5 వేల వంతున ఉపకార వేతనాలను మంగళవారం పంపిణీ చేసింది. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద రాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, రాజు కుటుంబీకులు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించి అభినందించారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం చేతుల మీదుగా ఉపకార వేతనాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. విజయనగరం మాన్సాస్ ట్రస్ట్ ప్రతినిధి, డీఈఈ ప్రసాద్ ఈకార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు.

డిప్యూటీ ఎంపీడీవో మంగాదేవి మృతి బాధాకరం



మంగాదేవి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న విశ్వరూప్

అమలాపురం రూరల్: అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ మర్యాదపూర్వకంగా మెలిగే డిప్యూటీ ఎంపీడీవో బడుగు మంగాదేవి మృతి బాధాకరమని ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అభిమానులు డిప్యూటీ ఎంపీడీవో మంగాదేవి సేవలను గుర్తు చేసుకుని తమ సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, ఎంపీటీసీ రేవు శ్రీను, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.డిప్యూటీ ఎంపీడీవో మృతి ఉద్యోగులకు తీరని లోటని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగాదేవి కుటుంబ సభ్యులను ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు కాశి రామకృష్ణ పరామర్శించారు. మంగాదేవి చిత్రపటానికి ఆయన పూల మాలలువేసి ఘన నివాళులర్పించారు.

బాధితులందరికీ న్యాయం చేయాలి



గ్యాస్ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, అధికారులు

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ గ్యాస్ పైపులైను లీకేజీతో జరిగిన అగ్నిప్రమాద తీవ్రత ప్రభావంతో అనేక గ్రామాల్లోని ప్రజలు నష్టపోయారని, ముఖ్యంగా తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న దరియాలతిప్ప, సీతారామనగర్, దోమ్మేటిపేట, సావిత్రినగర్, గిరియాంపేట గ్రామాలపై తీవ్ర ప్రభావం పడిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల ఓఎన్‌జీసీ గ్యాస్ పైపులైను లీకేజీతో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని ఆయన ప్రత్యేక బోటులో అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములైన ఐలాండ్ నంబరు-3 మీదుగా వెళ్లిన ఓఎన్‌జీసీ పైపులైను వద్ద ఏర్పడిన అగ్నిప్రమాద ఘటన భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేల్కొలుపని ఆయన అన్నారు. 20 ఏళ్లుగా చమురు సంస్థలైన ఓఎన్‌జీసీ, రిలయన్స్ సంస్థలు యానాం ప్రాంత అభివృద్ధికి ఎటువంటి సహాయం చేయలేదని ప్రజలకు ఉపాధి కల్పించలేదని ఆయన ఆరోపించారు.యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలకు చమురు సంస్థలు న్యాయం చేయాలని, అవసరమైతే నిరసన దీక్షకు సిద్ధమని ఆయన ప్రకటించారు. ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్సీ చింతా కోదండరామ్, డీటీ వెంకటేశ్వరరావు, రైతులు, గిరియాంపేట పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన అధికారులపై ఫిర్యాదు

అమలాపురం రూరల్: వినాయక చవితి సందర్భంగా జిల్లా కాలుష్య నియంత్రణ మండలి గణపతి మట్టి విగ్రహాలు ఉపయోగించాలని ముద్రించిన గోడ పత్రికలో డాక్టర్ అంబేడ్కర్ పేరు ఉపయోగించకుండా కోనసీమ జిల్లా అని ముద్రించి ప్రజలకు పంచారని జిల్లా దళిత ఐక్యవేదిక నాయకులు కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందించారు. కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, కోకన్వీనర్ రేవు తిరుపతిరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. కుల దురహంకారంతో వ్యవహరిస్తున్న జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్రావు, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీప్రణీత తదితర అధికారులపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టి రెండేళ్లు గడిచినా కొంతమంది జిల్లాస్థాయి అధికారులు ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పేరును విస్మరించి కేవలం కోనసీమ జిల్లా పేరుతో ఆదేశాలు జారీ చేస్తున్నారని అన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

అంటువ్యాధుల నిర్మూలనపై విస్తృత ప్రచారం

ఆలమూరు: వర్షాకాలం సీజన్ దృష్ట్యా వ్యాప్తి చెందే అంటువ్యాధుల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎన్.లక్ష్మీ స్నేహ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్దకు వెళ్లి వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత నీటిని తాగాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా సత్వరమే సమీప ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్ఈఓలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, హెచ్‌వీ ఆర్.బాలామణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.



పెదపళ్లలో అంటువ్యాధుల నిర్మూలనపై ఇటుక బట్టీ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కుంగుతున్న రక్షణ గట్టు

- ఎరుపు రిబ్బన్ కట్టిన కర్రలు ఏర్పాటు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- గట్టుకు గండి పడుతుందని స్థానికుల ఆందోళన

కాట్రేనికోన: గోదావరి వరద నీరు ఉగ్రరూపంతో ప్రవహిస్తున్న వేళ కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద పంట కాలువ వైపు రక్షణ గట్టు కుంగిన ప్రాంతంలో హెడ్ వర్క్స్ అధికారులు ఎరుపు రిబ్బన్లు కట్టిన కర్రలు పాతి వరద రక్షణ చర్యలు చేపట్టారు. అన్నంపల్లి నుంచి బలుసుతిప్ప వెళ్లే టైడల్ బ్యాంకు రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద గతేడాది క్షీణించింది. మురమళ్ళ నుంచి పల్లంకుర్రు వెళ్లేందుకు బీటీ రోడ్డు వేయడం, దగ్గర దారి కావడంతో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. కుండలేశ్వరం లాకు వద్ద పుష్కర ఘాట్ సమీపంలో రక్షణ గట్టు పనుల్లో నాణ్యత లేక గట్టు జారిపోతోంది.

మొక్కుబడిగా పనులు

ప్రస్తుతం గోదావరికి వరదలు రావడంతో కర్రలకు ఎరుపు రిబ్బన్లు కట్టి దిగబడిన ప్రాంతంలో ఏర్పాటు చేసి వరద రక్షణ చర్యలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శానపల్లిలంక వద్ద పడిన గండితో వరద నీరు కోనసీమను ముంపు నీటితో ముంచెత్తిన సంఘటనను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. రక్షణ గట్టు బలహీనంగా ఉన్న చోట శాశ్వత ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాలన్న అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.హెడ్ వర్క్స్ అధికారులు మొక్కు బడిగా పనులు చేపట్టడంతో సుమారు 150 మీటర్లు పంట కాలువ వైపు గట్టు జారింది. ఈ ప్రాంతంలో వాహనదారులు అనేక మంది ప్రమాదాలకు గురి అవుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం

రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద అధిక మొత్తంలో దిగబడటం, వరద నీరు మరింత పెరిగి పొరపాటున గండి పడితే కాట్రేనికోన, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల పరిధిలోని పలుప్రాంతాలకు ముంపు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. బూలవారి మొండి తదితర ప్రాంతాల్లో గట్టు బలహీనంగా ఉంది. మొక్కుబడిగా అక్కడ గ్రావెల్ వేసి నాసిరకం పనులు చేపట్టారు. ఇటీవల గోదావరి ఉగ్రరూపంతో ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై హెడ్ వర్క్స్ ఏఈఈ జీఆర్‌బీ ఈశ్వరసుబ్రహ్మణ్యంను వివరణ కోరగా శాశ్వతంగా ఉండేందుకు కాంక్రీట్ గోడ పనులు చేపట్టవలసి ఉందని, పనులకు సంబంధించిన నివేదికలు ప్రభుత్వానికి పంపించామన్నారు.



మురమళ్ల-బలుసుతిప్ప రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు కుంగిన ప్రాంతంలో ఎరుపు రిబ్బన్లు కట్టి ఏర్పాటు చేసిన కర్రలు